ఏజెన్సీని కమ్మేసిన పొగమంచు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీని పొగమంచు కమ్మేస్తోంది. ప్రతి ఏటా నవంబర్‌లో మొదలైన మంచు ప్రభావం ఫిబ్రవరి వరకు ఉంటుంది. గత వారం రోజుల నుంచి మంచు ఎక్కువగా కురవడంతో చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు తీవ్ర ఇబ్బందులకు గురై జలుబు, దగ్గుతో బాధ పడుతున్నారు. సోమవారం ఉదయం దట్టమైన పొగమంచు కారణంగా స్థానిక ఆర్‌టిసికాంప్లెక్స్ పరిసర ప్రాంతాలన్నీ మంచుతో కప్పుకున్నాయి. ఉదయం 10 గంటల వరకు మంచు ప్రభావం ఎక్కువగా కనిపించింది.

కురుపాం : మన్యంపై చలి తీవ్రత తగ్గి ఉక్క పోత గా ఉన్నప్పటికీ మంచు ప్రభావం చాలా ఎక్కువగా ఉండటం వలన సోమవారం ఉదయం 8 గంటల అయినప్పటికీ మంచు మన్యమంతట దట్టంగా తీవ్రంగా కురవడంతో వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. వాహనాలకు లైట్లు వేసుకొని ఆష్ట కష్టాలతో కుటుంబ సభ్యులతో ప్రయాణ ప్రయాసలు ఎదుర్కోవాల్సి వచ్చింది.

నెరవేరనున్న కల

- అందుబాటులో మరిన్ని వైద్య సేవలు
- వచ్చే ఏడాది నుంచి తరగతుల నిర్వహణకు సన్నాహాలు

శరవేగంగా మెడికల్ కాలేజి నిర్మాణం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సుమారు రెండు దశాబ్ధాలుగా జిల్లా వాసులు ఎంతగానో ఎదురు చూస్తున్న మెడికల్ కాలేజీ కల నెరవేరుతోంది. ఇంకా బోధన ప్రారంభం కాకపోయినప్పటికీ కాలేజీ నిర్వహణకు అవసరమైన సదుపాయాలు ఒక్కొక్కటిగా సమకూరుతున్నాయి. బోదనా సిబ్బంది పూర్తిస్థాయిలో నియమితులయ్యారు. ఇప్పుడిప్పుడే వైద్యారోగ్య సేవలు విస్తరిస్తున్నాయి. వచ్చే ఏడాది నుంచి అండర్ పోస్టు గ్రాడ్యుయేట్ (ఎంబిబిఎస్) తరగతులు ప్రారంభంచే దిశగా అడుగులు పడుతున్నాయి. భవన నిర్మాణ పనుల శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. ఈలోపు వసతి ఇబ్బందులు లేకుండా ఆసుపత్రి ఆవరణలో తాత్కాలిక ప్రాతిపదికన చేపట్టిన భవనాలు హంగులు, రంగులతో రూపుదిద్దుకున్నాయి.

జోరుగా సాగుతున్న మెడికల్ కాలేజి భవన నిర్మాణాలు

జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరైన నేపథ్యంలో అందుకు జిల్లా కేంద్రాసుపత్రిని కేటాయించిన విషయం విధితమే. ఘోషాసుపత్రి కూడా మెడికల్ కాలేజీకి అనుబంధంగానే మారింది. సుమారు ఆరు నెలల క్రితమే ఈ మేరకు విశాల సముదాయంతో కూడిన ఆసుపత్రి భవనాలను మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఇక్కడ పనిచేసిన వైద్య విధాన పరిషత్ వైద్యులంతా ఆ విభాగంలో నడుస్తున్న ఏరియా ఆస్పత్రులకు, సిహెచ్‌సిలకు బదిలీ అయ్యారు. దాదాపు అదే సంఖ్యకు తగ్గట్టు బోదనా వైద్యులు నియమితులయ్యారు. ఇదే ఆసుపత్రిలో పనిచేస్తున్న సుమారు 250మంది సిబ్బంది యథాతద స్థానాల్లో కొనసాగుతున్నారు. మెడికల్ కాలేజీకి అవసరమైన సిబ్బందిని దశలవారీగా భర్తీ చేస్తున్నారు. ప్రస్తుతం అడ్మినిస్ట్రేటివ్ విభాగం కూడా ఆసుపత్రిలో కొనసాగుతోంది. డాక్టర్ పద్మలీల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న విషయం విధితమే. ఇటీవలే అప్పలనాయుడు సూరింటిండెంట్‌గా నియమితుల య్యారు. ఘోషాసుపత్రి కూడా మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉండనుంది.

మొత్తం ఈ రెండు చోట్ల (సర్వజనాసుపత్రి, ఘోషాసుపత్రిలో) 430బెడ్‌లు అందుబాటులో ఉన్నాయి. గతం నుంచి ఉన్న మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, డెంటల్, ఆర్థో తదితర విభాగాలకు తోడుగా టీచింగ్‌కు తోడ్పడే అటానమీ, ఫియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ (పెథాలజీ), ఫ్లోరెన్సిక్ మెడిసిన్, ఎస్‌పిఎం తదితర అనుబంధ విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ విభాగాలు కలుపుకుని మెడికల్ కాలేజీలో మొత్తం 22 విభాగాలు ఉన్నాయి. ఎనస్తీషియా విభాగంలో తప్ప మిగిలిన అన్ని విభాగాల్లోనూ తగినంతమంది వైద్యులు ఉన్నారు. లేబొరెటరీలో అదనపు సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఈనేపథ్యంలో మెడికల్ కాలేజీలో ఓపి, ఐపిల సంఖ్య పెరిగింది. కార్డియాలజీ, నెఫ్రాలజీ తదితర సూపర్ స్పెషాలిటీ విభాగాలు మాత్రం ఇంకా అందుబాటులోకి రావాల్సివుంది. కాలేజీలో తరగతులు ప్రారంభమయ్యాక అండర్ పోస్టుగ్రాడ్యూట్ తొలి బ్యాచ్ విడుదల కావాలంటే కనీసం 5ఏళ్ల సమయం పడుతుంది. ఆ తరువాతే కాలేజీలో పీజీ కోర్సులు అందుబాలోకి రానున్నాయి. ఇలా కాలేజీలో పీజీ కోర్సులు అందుబాటులో వచ్చాక మాత్రమే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల ప్రజాశకికి తెలిపారు.

మరోవైపు గాజులరేగ పరిధిలో సుమారు 70ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రభుత్వం తరపున మంత్రులు, ఉన్నతాధికారుల నుంచి నిరంతర పర్యవేక్షణ జరుగుతోంది.

ఔట్ పేషెంట్లు పెరిగారు

జిల్లా కేంద్రాసుపత్రి మెడికల్ కాలేజీగా మారిన తరువాత వైద్య సదుపాయాలు మరింతగా పెరిగాయి. ఈనేపథ్యంలో ఔట్ పేషెంట్ల సంఖ్య 10శాతం పెరిగింది. గతంలో రోజూ 1000 నుంచి 1100మంది వచ్చేవారు. ప్రస్తుతం 1100 నుంచి 1200మంది వరకు వస్తున్నారు. ఆ మేరకు ఇన్‌పేషెంట్ల సంఖ్యకూడా పెరుగుతోంది. కరోనాను ఎదుర్కోనేందుకు మెడికల్ కాలేజీ అప్రమత్తంగా ఉంది. అవసరమైనంత ఆక్సిజన్ నిల్వలు ఉన్నాయి. లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్, పిఎస్ఎ ప్లాంట్లు ఉన్నాయి. సుమారు 100 పడకలకు సెంట్రల్ ఆక్సిజన్ సప్లై కూడా ఉంది. మెడికల్ టీమ్స్ కూడా వేశాం.

డాక్టర్ పద్మ లీల
మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, విజయనగరం

సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న కోశాధికారి వెంకటరమణ

సిఐటియు ఆలిండియా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి... పార్వతీపురం టౌన్

సిఐటియు ఆలిండియా 17 వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా కోశాధికారి జి వెంకటరమణ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో తోపుడు బళ్ళు, అటో కార్మికుల నాయకులతో కలిసి సిఐటియు ఆధ్వర్యంలో జండా ఎగరవే వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగుళూరులో సిఐటియు 17వ అఖిలభారత మహాసభలు జరుగుతున్నాయని అందరూ జయప్రదం చేయాలని కోరారు. కార్మికుల సమస్యల పైనా ప్రభుత్వ విధానాల పైన చర్చించి రాబోయే మూడేళ్లలో పోరాటా రూపకల్పన చేస్తారని అన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్లకు పెట్టుబడిదారులకు లాభాలు సమకూరుస్తుంది. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం జీవో1 ఒకటిని తెచ్చి రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను, నిరసన తెలిపే హక్కును, ర్యాలీలు, సభలను అనుమతించమని జీవో నెంబర్ ఒకటిని తెచ్చిందని ఇది చాలా దుర్మార్గమైన ఈ జీవో అని, దీన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో సిఐటియు చేస్తున్న పోరాటాన్ని ప్రజలు బలపరచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు బి సూరిబాబ, భాష, గోవింద, బలరాం, శ్రీను, సోమేశు తదితరులు పాల్గొన్నారు.

రైతువాణి క్యాలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-వేపాడ

ఎపి రైతు సంఘం ముద్రించిన 2023 రైతువాణి పత్రికతో పాటు క్యాలండర్, డైరీని సంక్రాంతి సందర్భంగా సోమవారం డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చినరామునాయుడు మాట్లాడుతూ రైతువాణి పత్రికను లాభాపేక్ష లేకుండా రైతుల ప్రయోజనం కోసం రైతుసంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రైతువాణిలో కార్పొరేట్ వ్యవసాయ పద్ధతులే కాకుండా సాధారణ రైతు వ్యవసాయ పద్ధతులు, ప్రపంచంలో, దేశంలో రైతులు పోరాడి సాధించిన విజయాలు, వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు, ఆదర్శరైతుల విజయాలపై వ్యాసాలు రావడం అభినందనీయమని అన్నారు. రైతువాణి మాస పత్రికను రైతులు అందరూ అందరించాలని కోరారు కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఉపాధ్యక్షులు చల్లా జగన్‌తో పాటు ఉపసర్పంచ్ కండిపల్లి. పెద్దనాయుడు, తదితరులు పాల్గొన్నారు

మిన్నంటిన సంక్రాంతి సంబరాలు

- కనుమ రోజు కళకళలాడిన పల్లెలు
- ఇసుక తెన్నులు, కొండలపై జన సందడి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

భోగి మంటలు.. బొమ్మల కొలువులు.. ముగ్గుల పోటీలు.. బసవన్న ఆటలు.. హరిదాసు కీర్తనలు.. కబడ్డీ కేకలు.. క్రికెట్ కేరింతలు.. వంటకాల ఘుమఘుమలు.. పేరంటాల సందళ్లు.. కనుమ పూజలు.. స్నేహితుల కరచాలనాలు, కౌగిలింతలు...ఇసుక తెన్నులపై ఆట పాటలు ఇవీ భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో గ్రామాల్లో సంప్రదాయంగా కనిపించిన దృశ్యాలు. ఊళ్ల పాలిమేరల్లోని ఇసుక తిన్నెలు, మట్టిదిబ్బలు, సెలయేళ్లు, పంటపొలాల్లో యువతీ యువకులు, చిన్నారులు ఉత్సాహంగా, ఉల్లాసంగా సందడి చేశారు. హరిదాసులు హడావిడి అలనాటి సంస్కృతి సంప్రదాయాలను గుర్తుచేశాయి.

కొమరాడలో నాగావళి నది ఒడ్డున ఇసుక తిన్నెలపై గ్రామస్తులు

ఏడాది పొడవునా తెలుగు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూసే సంక్రాంతి, కనుమ పండగలు ఈ ఏడాది ఎంతో అనందంగా గడుపుకున్నారు. జిల్లాలోని ప్రతి పల్లె ఆనందం పరవళ్ల తొక్కింది. బతుకుతెరువు కోసం వలస వెళ్లిన వారు స్వగ్రామాలకు తరలిరావడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. తరించిన పోయిన పెద్దలను గుర్తు చేసుకుంటూ వారిపేరిట కొత్తబట్టలు చూపించడంతో పాటుగా, సంప్రదాయ పద్ధతుల్లో పొత్తర్లు దానాలు చేయడం ఎక్కడచూసినా ఇవే దృశ్యాలు సాక్ష్యాత్కరించాయి. యువతీ, యువతులు కొత్తబట్టలు వేసుకుని, వీధుల్లో తిరుగుతూ, స్నేహితులను పలకరించుకుని, సెల్పీలు దిగుతూ పండగకు కొత్తశోభను చేకూర్చారు. మండలంలోని రావికోనంలో సర్పంచ్ కె.రామస్వామి ఆధ్వర్యంలో కొత్తవలస, రంగాలగూడ, రావికోన గ్రామాల్లో నిర్వహించిన ముగ్గులపోటీలు, వాలీబాల్‌పోటీల్లో పెద్దఎత్తున యువత పాల్గొన్నారు. విజేతలకు చీరలు, దుస్తులు బహుమతులుగా అందించారు. పుట్టూరు, ములగ, బందలుప్పి, జమదాలతో పాటు పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అలాగే తాళ్లబురిడిలో ప్రతి ఏటా కనుమ పండగనాడు వింజమ్మ కొండపై జరిగే జాతరకు పెద్దఎత్తున గ్రామస్థులు హాజరై ఒకరినొకరు పలకరించుకుంటూ చేసిన సందడిలో ఆప్యాయతలు పొంగిపొర్లాయి. నరిసిపురంలో జరిగిన మెరకపండగకు పెద్దఎత్తున జనం హాజరయ్యారు.

గిరిజన గ్రామాల్లో అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు

భామిని : మండలంలోని ఆదివాసీ గ్రామమైన మనుమకొండలో గిరిజనులు లైటింగ్, డిజెతో స్టేజి పైన ఆదివారం రాత్రి మన ఊరు -మన సంక్రాంతి పేరుతో సంక్రాంతి సంబరాలును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పులు, గిరిజన నృత్యాలు, సోలో డాన్స్‌లు, పాటలు, ఆటలతో గ్రామంలోని పురుషులు, మహిళలు ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో ఉత్సాహంగా గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మనుమకొండ సర్పంచ్ నిమ్మల కేశవ మాట్లాడుతూ గ్రామంలో ఐక్యంగా ప్రతి ఏటా సంక్రాంతికి గ్రామ స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించటం, సాంప్రదాయ గిరిజన నృత్యాలు, ఆటలు, పాటలతో యువత సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామని అన్నారు. ప్రభుత్వశాఖల్లో ఉద్యోగస్తులుగా స్థిరపడిన యువత ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ పండుగ వేళ చెడు వ్యాసనాలకు దూరంగా వుంటూ, చదువు, కెరీర్ పట్ల దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, గ్రామం లో యువత పాల్గొన్నారు.

లారీపై ఏటా రూ.10వేలు భారం

- నడపలేమంటున్న యజమానులు
- పక్క రాష్ట్రాల కంటే పన్నులెక్కువ
- రోడ్ టాక్స్ పెంపుతో సంక్షోభంలో పరిశ్రమ

ప్రజాశక్తి - సాలూరు

మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు ఆర్థిక సంక్షోభంలో కూరుకున్న లారీ పరిశ్రమ పన్నుల బాదుడుతో కునారిల్లుతోంది. గడచిన రెండేళ్లుగా కరోనా వైరస్ విజృంభణ, లాక్‌డౌన్ వల్ల లారీ యజమానులు పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయిన పరిస్థితి ఏర్పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు పెంచుకుంటూ పోతుండడంతో లారీలు నడపడం యజమానులకు కత్తిమీద సాములా తయారైంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం లారీలు, వ్యానులు, ఆటోలపై క్వార్టర్లీ రోడ్ టాక్స్‌ను 25శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నాలుగు చక్రాల వాహనదారులు అయోమయంలో పడ్డారు. అసలే సంక్షోభంలో కూరుకున్న లారీ పరిశ్రమను గట్టెక్కించే ప్రయత్నాలు ప్రభుత్వం చేయకుండా పన్నులు పెంచుకుంటూ పోతుండటంతో యాజమానులు ఆందోళన చెందుతున్నారు. ఉన్న లారీలు అమ్ముకోలేక, నిర్వహణా భారం భరించలేక అప్పుల పాలవుతున్నారు. ఆరునెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ టాక్స్‌ను దారుణంగా పెంచింది. పక్క రాష్ట్రం తమిళనాడులో గ్రీన్ టాక్స్ రూ.200 ఉంటే ఎపిలో రూ.20వేలకు పెరిగింది. ఇవే కాక లారీలకు సంబంధించిన ఫిట్ నెస్ ఫీజులు దారుణంగా పెరిగిపోవడంతో యజమానుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రాష్ట్రంలో విజయవాడ తర్వాత లారీలు ఎక్కువగా ఉన్న పట్టణం సాలూరు మాత్రమే. సుమారు 1500 లారీలు పట్టణంలో ఉన్నాయి. లారీల నిర్వహణకు అప్పులు చేసి కిరాయి డబ్బులు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో లారీ యజమానులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. పక్కనున్న ఒడిశా, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల కన్నా డీజిల్ ధరలు ఎపిలో ఎక్కువగా ఉన్నాయి. ఇరుగు, పొరుగు రాష్ట్రాల కంటే డీజిల్ ధర ఐదు రూపాయలు ఎక్కువగా ఇక్కడ ఉంది. దీంతో లారీ యజమానులు పక్క రాష్ట్రాల్లో డీజిల్ కొనుగోలు చేసుకునే పరిస్థితి కనిపిస్తోంది. పట్టణంలోని లారీల్లో 50శాతం వరకు పాతలారీలు వున్నాయి. వీటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు చేయించడం యజమానులకు పెనుభారంగా మారింది. లారీ ఎంత పాతదైదే యజమాని అంత ఎక్కువ ఫీజు చెల్లించాల్సి వస్తోంది. పన్నుల భారం, నిర్వహణ వ్యయం పెరుగుతుండడంతో చాలామంది యజమానులు లారీలను అమ్ముకోవడానికి సిద్ధమవుతున్నారు. చేసిన అప్పుల నుంచి బయట పడలేక, లారీలు నడపలేక యజమానులు గందరగోళంలో కొట్టుమిట్టాడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో లారీ యజమానులు పోరాటానికి సిద్ధమవుతున్నారు. లారీ యజమానుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు త్వరలో కార్యాచరణ కు రంగం సిద్ధం చేస్తున్నారు.

ప్రభుత్వ చర్యలతో మరింత సంక్షోభం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 25శాతం రోడ్ ట్యాక్స్ పెంపుతో లారీ పరిశ్రమ మరింత సంక్షోభంలో కూరుకుపోనుంది. గ్రీన్ ట్యాక్స్ ని రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచింది. తమిళనాడులో గ్రీన్ ట్యాక్స్ రూ.200 ఉంటే ఎపిలో రూ.20వేలకు ఇక్కడి ప్రభుత్వం పెంచింది. ఫిట్ నెస్ సర్టిఫికేట్ల ఫీజులు కూడా ఎక్కువగా పెరిగాయి. పక్క రాష్ట్రాల్లో కంటే డీజిల్ ధర ఇక్కడ ఐదు రూపాయలు ఎక్కువగా వుంది. ఈ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతుంటే ఇప్పుడు రోడ్ ట్యాక్స్ పెంచడం మరింత కష్టాల్లో కూరుకుపోయే ప్రమాదం. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ త్వరలో లారీ యజమానులు పోరాటానికి సిద్ధమవుతున్నారు. దీనికి సంబంధించిన కార్యాచరణను రాష్ట్ర కమిటీ సిద్ధం చేస్తోంది.

ఐ.నారాయణరావు
లారీ యజమానుల సంఘం కార్యదర్శి, సాలూరు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

అత్తింటి వారి వేధింపులే కారణం : మృతురాలి అన్నదమ్ముల ఆరోపణ

పాలకొండ /వీరఘట్టం

వీరఘట్టం మండలం తూడిలో చందక పద్మావతి(46) అనే మహిళ సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల అందించిన సమాచారం మేరకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పద్మావతి గన్నేరు పప్పులు తిని అపస్మార స్థితిలోకి చేరిపోగా, ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు ఆమెను పాలకొండ ఏరియా హాస్పిటల్ తరలించారు. అక్కడ చికిత్స పొందినట్లు మృతురాలి కుమారుడు చందక త్రివేది నాయుడు పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు వీరఘట్టం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు .

మృతి చెందిన పద్మావతి

కుటుంబ సభ్యుల వేధింపులకి పద్మావతి మృతి

తమ చెల్లెలు పద్మావతిని ఆమె భర్త చందక వెంకటరమణ, మరిది శ్రీను, తోటికోడలు లక్ష్మి, కుమారుడు వేధింపుల వల్లనే మృతి చెందిందని పద్మావతి అన్నయ్యలు ఆరోపించారు ఈ మేరకు పద్మావతి అన్నయ్యలు ముగిది రాము, దేవీ వరప్రసాద్, శ్రీను, గోపి వారిపై ఫిర్యాదు చేశారు. తక్షణమే పద్మావతి భర్త వెంకటరమణ అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు

ఏరియా ఆసుపత్రి వద్ద ఆందోళన

తమ చెల్లెలు పద్మావతిని మానసిక వేధించిన తమ బావ వెంకటరమణతో పాటు వారి కుటుంబ సభ్యులు మృతికి ప్రేరేపించారని ఏరియా ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. సమాగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పాలకొండ సిఐ మురళీధర్, వీరఘట్టం ఎస్సై హరికృష్ణ పద్మావతి కుటుంబ సభ్యులను శాంతంపజేసి పోస్టుమార్టం పూర్తయ్యల చర్యలు చేపట్టారు

జోరుగా కోడిపందేలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మామిడిపల్లిలో జరుగుతున్న కోడె పందేలు

సంక్రాంతి వచ్చిందంటే చాలు చుట్టు పక్కల గ్రామాలతో పాటు పొరుగు మండలాల్లోనూ కోడి పందేలు అంటే మామిడిపల్లి అనే నానుడి. గత మూడు దశాబ్దాలుగా సంక్రాంతి మూడు రోజులు గ్రామానికి పక్కన గల పామాయిల్ తోటలో స్థానిక యువత బరులు ఏర్పాటు చేసి భారీ ఎత్తున లక్షల్లో పందేలు జరుగుతాయి. ఇక్కడ పందేల గురుంచి స్థానిక పోలీసులకు తెలిసినా ఈ మూడు రోజులు చూసీ చూడనట్లు పండగ సందర్భంగా ఏమీ అనరని నిర్వాహకులు వెల్లడించారు.

పందెం రాయుళ్లు అరెస్టు

మక్కువ : మండలంలోని దబ్బగెడ్డలో సోమవారం జరిగిన కోడి పందాలపై పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా రూ.10700 నగదు తో పాటు ఆరు కోడి పుంజులు పట్టుబడ్డాయని ఎస్సై పైడ్రాజు తెలిపారు 8 మందిని అరెస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు.

పాచిపెంట : మండలంలోని గురువు నాయుడుపేట సమీపానన గల మామిడి తోటలో ఆదివారం కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేయగా నాలుగు పందెం కోళ్ళు, రూ.60వేలు నగదు, ఆరుగుర్ని అదుపులోకి తీసుకున్నారు. వీరిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేసినట్లు హెచ్ సి కృపారావు తెలిపారు

శ్రీరామ్మూర్తి జ్ఞాపకార్థం ఆటల పోటీలు

ప్రజాశక్తి-సీతానగరం

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజా నాయకుడు రెడ్డి శ్రీరామ్మూర్తి జ్ఞాపకార్థం ఆయన స్వగ్రామం రెడ్డివానివలసలో ఆదివారం డివైఎఫ్ఐ, గ్రామ యువత, పెద్దలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సిపిఎం జిల్లాకార్యదర్శి రెడ్డి వేణు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు గ్రామంలో సమైక్యత స్ఫూర్తి నింపాయని అన్నారు. ఈ గ్రామంలో రెడ్డి శ్రీరామ్మూర్తి, రెడ్డి వేణు అప్పటి యువత 1987లో డివైఎఫ్ఐ ప్రారంభించిన పుటినుండి గత సంవత్సరం కరోనాతో శ్రీరామ్మూర్తి మరణించేవరకు 37ఏళ్ల పాటు ఆటల పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ స్ఫూర్తిని కొనసాగించాలని ప్రస్తుత గ్రామ యువకులంతా కలిసి చర్చించుకొని ఈ ఏడాది ఆటల పోటీలు నిర్వహించి వారసత్వాన్ని కొనసాగించారని తెలిపారు. ఈసందర్భం స్లోసైక్లింగ్, క్రికెట్, చెస్, రన్నింగ్, ముగ్గుల పోటీలు, టగ్గాఫోర్ (తాడు లాగటం), డాన్స్ పోటీలు, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. రెడ్డి హరి, రెడ్డి నవీన్ ,సందీప్, తదితర 20 మంది యువకులు ముందుండి ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. బహుమతులను శ్రీరామ్మూర్తి సతీమణి శ్రీదేవి, గ్రామ పెద్దలు రెడ్డి తవిటినాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, రాము, రమేష్ గ్రామ వైస్ ప్రెసిడెంట్ రెడ్డి లక్ష్మీనాయుడు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, రైతునాయకులు రెడ్డి రవణమూర్తి, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు రెడ్డి శంకర్రావు, యుటిఎఫ్ నాయకులు జి నిర్మల, వి.ఇందిర తదితరులు అందజేశారు. శ్రీరామ్ మూర్తి ఆశయాలని ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్లాలని వక్తలు యువతను కోరారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య,రెడ్డి వానివల యూత్ కమిటీ నిర్వాహకులు రెడ్డి హరి తదితరులు తెలిపారు.

పల్లెల పరిస్థితి ఇంతేనా?

వీరఘట్టం ప్రధాన రహదారి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

జె.గోపాలపురంలో కాలువ లేకపోవడంతో రహదారిపై నిల్వ ఉన్న మురికి నీరు

- విలయతాండం చేస్తున్న అపారిశుధ్యం
- గోతులతో నిండిన రహదారులు
- అవస్థలు పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి - వీరఘట్టం

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని నానుడు మాట... దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఏడు దశాబ్దాలు పైబడినప్పటికీ నేటికీ పల్లెలు అభివృద్ధికి నోచుకోలేదంటే పాలకుల పనితీరు ఏవిధంగా వీటిని చూస్తేనే అర్థం చేసుకోవచ్చు. మీ గ్రామాలకు అది చేస్తాం... ఇది చేస్తాం అని పాలకులు ఉపన్యాసాలకే పరిమితమవుతున్నారా తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పల్లెలు అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు పల్లెలు పచ్చని పొలాలతో పాటు స్వచ్ఛమైన గాలులు ఆహ్లాదకరమైన పరిస్థితి కనిపించేది. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడ కాన రావటం లేదు. ఏ గ్రామానికి వెళ్లాలనా సరైన రోడ్డు సదుపాయం లేదు. ప్రతి పల్లెలో అపారిశుధ్యం విలయ తాండవం చేస్తుంది. దీంతో ప్రజలు రోగాల బారినపడి వేలాది రూపాయలు వెచ్చించి ఆరోగ్యాన్ని మెరుగుర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

మండలంలోని నీలంపేట, పెద గదవలస, కాగితాడ, యు వెంకంపేట, పివిఆర్ పురం, డిపి వలస, రామాపురం, చేబియ్యంవలస, బల్లగుడ్డు, బట్టిగూడ, చిదిమి తదితర గ్రామాల్లోకి వెళ్లే రోడ్లు ఎక్కడికక్కడే గోతులతో నిండి ఉండడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకవేళ గ్రామంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే 108, 104 వాహనాలు వచ్చే దాఖలాలు కూడా కానరావడం లేదు. దీంతో పల్లె ప్రజలు మైదాన ప్రాంతాలకు చేరుకొని అక్కడి నుంచి వేరే వాహనాలు కట్టించుకొని పట్టణ ప్రాంతాలకు చేరుకుని వైద్యం పొందాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాళ్లు తేలిన కంబర గ్రామ రహదారి

అర్ధాంతరంగా నిలిచిపోయిన రహదారి నిర్మాణ పనులు

మండలంలోని హుస్సేన్ పురం సెవెంత్ బ్రాంచి తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ నుంచి నీలంపేట వరకు గత ప్రభుత్వ హాయంలో 2019లో సుమారు రూ.4.6 కోట్లతో బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులను ఉమ్మడి జిల్లా అయినా శ్రీకాకుళానికి చెందిన శ్రీ సాయి బాలాజీ కన్స్ట్రక్షన్స్ వారు ఈ పనులు దక్కించుకున్నారు.

రాళ్లు తేలిన నీలం పేట రహదారి

లైనింగ్ పనులు 40 ఎంఎం గల షిప్స్ రాయి రహదారిపై వేశారు. చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు సగంలోనే పనులు నిలిపివేశారు. అలాగే సిఎస్‌పి రహదారి నుంచి యు.అంకంపేట మీదుగా చిదిమి, యు వెంకంపేట నుండి చిదిమి వరకు కోటి రూపాయలతో పనులు ఈ రహదారికి సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు అర్ధాంతగా పనులు నిలిపివేశారు. ఆడారు గ్రామ జంక్షన్ నుంచి డిపివలస వరకు కోటి రూపాయలతో బిటి రహదారి నిర్మాణ పనులు చేశారు. ఈ రహదారికి సంబంధించి బిల్లులు చెల్లించపోవడంతో గుత్తేదారు అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. దీంతో చిన్నపాటి వర్షం పడినా ఈ రోడ్లు చిత్తడి చిత్తడిగా మారుతున్నాయి. వీటిపై ప్రయాణం చేయాలంటే సాహసం చేయక తప్పదని గ్రామస్తులు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పల్లె రహదారుల అభివద్ధికి తగు చర్యలు తీసుకోవాలని పల్లె ప్రజలు కోరుతున్నారు.

బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు అవస్థలు

మండల కేంద్రమైన వీరఘట్టంలో ఇటీవల కాలంలో పాత బస్టాండ్‌లో బస్సు షెల్టర్ నిర్మించినప్పటికీ వాటి రూపురేఖలు మార్చి 4 సచివాలయంగా వినియోగిస్తున్నారు. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సి పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో పాటు వట్టిగెడ్డ వంతెన వద్ద, అంబేద్కర్ కూడలి వద్ద ఎటువంటి ఆధారం లేకపోవడంతో ప్రయాణికులు దుమ్మూ, ధూళి భవరించి వాహనాల కోసం వేచి చూస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి సమస్యలేని వీర ఘట్టం గ్రామముగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

గెలుపొందిన విజేతలు

షటిల్ టోర్నీ విజేత కురుపాం జట్టు

కురుపాం : మండలంలోని దాసరిపేట లో స్వామి వివేకానంద యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన సెటిల్ టోర్నీలో కురుపాంకు చెందిన సంతు, రవి ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో సాయి, హరీష్, పార్వతీపురానికి చెందిన రెండు జట్లు 3,4, స్థానంలో నిలచాయి. ఈ నాలుగు టీములకు సంక్రాంతి రోజున కళింగ వైశ్య జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, కురుపాం మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు క్రీడలు నిర్వహించిన యువతను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడల వల్ల అనేక అనారోగ్య సమస్యలు పోయి మానసిక ఉల్లాసం, ధృఢ సంకల్పం కలుగుతుందన్నారు. అనంతరం యువత పెద్దలకు సన్మానించారు. కార్యక్రమంలో వివేకానంద యూత్ క్లబ్ అధ్యక్షులు గొల్లపల్లి శంకర్, మాజీ ఉపసర్పంచ్ గొల్లపల్లి సత్యనారాయణ నాయుడు, గ్రామ పెద్దలు గొల్లపల్లి రమణమూర్తి, సీనియర్ సెటిల్ ప్లేయర్ చిప్పాడ గోపి, స్థానిక యువత పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న చంద్రశేఖర్, రాము

ఘనంగా సంక్రాంతి వేడుకలు

బలిజిపేట: మండలంలోని అరసాడ కొత్తవీధిలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. గ్రామ యువత ఆధ్వర్యాన మహిళలకు, చిన్నారులకు డాన్సు, పాటల పోటీలు, కుర్చీ ఆటలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వై.చంద్రశేఖర్, గులిపల్లి శంకరరావు, సిహెచ్ రాము, గుల్ల బాబ్జి, గుల్ల వరప్రసాద్, భోగి శంకరరావు, గంట రమేశ్ నాయుడు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

కిటకిటలాడుతున్న చేపల మార్కెట్

పార్వతీపురం టౌన్ : కనుమ పండగను పురస్కరించుకొని సోమవారం స్థానిక చేపల మార్కెట్ కొనుగోలు దారులతో కిట కిట లాడింది. దీంతో వ్యాపారులు చేపల ధరలను అమాంతంగా అధిక ధరలకు విక్రయించారు. సాధారణ రోజుల్లో కిలో 130 రూపాయలకు అమ్మకాలు చేసిన మామూలు చేపలు పండగ సందర్భంగా రూ.200కు అమ్మకాలు చేశారు. అలాగే కిలో రూ.300 అమ్మిన సవడ చేపలు రూ.400కు వ్యాపారులు అమ్మకాలు చేశారు. దీంతో చేసేదిలేక కొనుగోలుదారులు వ్యాపారాలు చెప్పిన ధరలకే చేపలను కొనుగోలు చేశారు. సోమవారం నాడే చేపలను ఈ ధరలకు విక్రయాలు సాగిస్తే మంగళ, బుధవారాలు ఇంకా ఎంత ధరలకు చేపలను విక్రయిస్తారో అని కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు.

గిరిజన ప్రాంతానికి రెడ్ క్రాస్ సేవలను విస్తరిస్తాం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం, కురుపాం గిరిజన మండలాల్లో రెడ్‌క్రాస్ సేవలను విస్తరిస్తామని రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ మంచిపల్లి శ్రీరామ్మూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిసర ప్రాంతాలతో పాటు గిరిజన ప్రాంతాల్లోనూ రెడ్ క్రాస్ సంస్థ ద్వారా వైద్య శిబిరాలు ఏర్పాటు పేదలకు వైద్యసేవలందించడంతో పాటు మందులను, ఇతర పరికరాలు పంపిణీ చేస్తామని చెప్పారు. గుమ్మ లక్ష్మీపురంలో రెడ్ క్రాస్ శాశ్వత సభ్యులు కొండలరావు, హరి ప్రసాద్, కుమారస్వామి ఉన్నారని వీరి సహకారంతో రెడ్ క్రాస్ సేవలను విస్తరిస్తామని అన్నారు.

మినీ రిజర్వాయర్ నిర్మించండి

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని కేదారిపురం పంచాయతీ కెడికాలనీ సమీపంలో మినీ రిజర్వాయర్ నిర్మించాలని ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండింగి రమణ విజ్ఞప్తి చేశారు. గత 25 ఏళ్లుగా మినీ రిజర్వాయర్ నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు రైతులు కోరుతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదని ఆరోపించారు. మినీ రిజర్వాయర్ నిర్మిస్తే కేదారిపురం, టెంకసింగి, సిమలగూడ, గుణద తదితర ప్రాంతాలకు చెందిన సుమారు పదివేల ఎకరాలకు సాగునీరందుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి మినీ రిజర్వాయర్ నిర్మించాలని కోరారు.

వట్టిగెడ్డ ఆధునికీకరణ పనులు
ఈ ఏడాదైనా పూర్తయ్యేనా?

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని ప్రధాన సాగునీటి వనరైన వట్టిగెడ్డ రిజర్వాయర్ ఆధునీకరణ పనులు ఈ ఏడాదైన పూర్తయి రైతాంగానికి సాగునీరందేనా అన్న ప్రశ్నలు రైతులు వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ ఆధునీకరణ పనుల కోసం రెండేళ్ల క్రితం జైకా నిధులు రూ.44 కోట్లు జలవనరుల శాఖ నుంచి మంజూరు చేశారు. పనులు నత్త నడకన సాగుతున్నాయి. గత ఏడాది పనులను నిర్వహించినా పూర్తిస్థాయిలో పనులు జరగక వర్షాకాలం రావడంతో పనులను నిలిపివేశారు. మండలంలో రావాడ వద్ద 1977 సెప్టెంబర్ నెలలో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఈ రిజర్వాయర్‌ను ప్రారంభించారు. కుడి, ఎడమ కాలువల ద్వారా 16 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఏర్పాట్లతో రిజర్వాయర్ నిర్మాణాన్ని చేశారు. కుడి కాలువ 9.756 కిలోమీటర్ల పొడవు, ఎడమ కాలువ 8.047 కిలోమీటర్ల పొడవుతో నిర్మాణం చేసియున్నారు. కుడి కాలువ ద్వారా 13,324 ఎకరాలకు, ఎడమ కాలువ ద్వారా 3,360 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రిజర్వాయర్‌ను ఏర్పాటు చేసి ఉన్నారు. నిర్మాణం జరిగి సుమారు 50 ఏళ్లు కావడంతో రిజర్వాయర్ స్వేటర్లతో పాటు కాలువలు కూడా

అస్తవ్యస్తంగా తయారై సాగునీరు రైతాంగానికి పూర్తిస్థాయిలో అందడం లేదు. గత 15ఏళ్ల నుంచి శివారు గ్రామాల రైతాంగానికి సాగునీరు పూర్తిగా అందడం లేదు. కుడి కాలువ ద్వారా బాసంగి గ్రామం వరకు మాత్రమే వట్టిగెడ్డ రిజర్వాయర్ ద్వారా సాగునీరందుతుంది. గరుగుబిల్లి మండలం ఖడ్గవలస వరకు సాగునీరు అందాల్సి ఉండగా చాలా కాలం నుంచి రిజర్వాయర్ ద్వారా సాగునీరందించలేని పరిస్థితి నెలకొంది. రైతాంగం ఎన్నో ఏళ్ల నుంచి ప్రభుత్వాలకు విన్నవిస్తున్నా పట్టించుకోలేదు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సాగునీటి రిజర్వాయర్లపై దృష్టి సారించడంతో స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి చొరవతో ఈ ప్రాంత రైతాంగానికి ఉపయోగపడే ఒట్టిగడ్డ రిజర్వాయర్ ఆధునీకరణ పనులు కోసం జైకా నిధులను రూ.44 కోట్లు మంజూరు చేయించారు. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు గత ఏడాది నుంచి పనులను ప్రారంభించి కాలువ పనులు, రిజర్వాయర్ వద్ద షట్టర్స్, తదితర పనులను చేపట్టారు. రిజర్వాయర్ వద్ద షట్టర్ల పని పూర్తి స్థాయిలో జరిగిన కుడి, ఎడమ కాలువ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. కాలువల్లో పూడిక తీత, సమాంతర పనులు చేశారు తప్ప రివీట్‌మెంట్ తదితర పనులు ఎక్కడా చేపట్టలేదు. గత ఏడాది జూలై వరకు పనులను చేపట్టి వర్షాకాలం రావడంతో పనులకు ఆటంకం ఏర్పడి పనులను సంబంధిత కాంట్రాక్టర్ నిలిపివేశారు. దీంతో పనులు అర్ధాంతంగా నిలిచిపోయాయి. 16 వేల ఎకరాలకు సాగునీరందాలంటే పూర్తి స్థాయిలో పని జరిగితే శివారు గ్రామాలకు కూడా సాగునీరందే పరిస్థితి ఉంది. గత ఏడాది ఖరీఫ్ నాటికే పనులు పూర్తి కావాల్సి ఉండగా నత్తనడకన సాగి పూర్తికాని పరిస్థితి నెలకొంది. సాగునీటి కోసం శివారు గ్రామరైతుల ఆశగా ఎదురుచూస్తున్న కాలువ పనులు సక్రమంగా జరగకపోవడంతో సాగునీరు గత ఖరీఫ్‌కు రైతులకు అందలేదు. ఈ ఏడాదైనా పనులను పూర్తి చేసి కుడి, ఎడమ కాలువల ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరందించే ఏర్పాట్లు చేయాలని ఒట్టిగడ్డ రిజర్వాయర్ ఆయకట్టు రైతాంగం నీటిపారుదల శాఖ అధికారులను కోరుతున్నారు. ఖరీఫ్ నాటికైనా సంబంధిత శాఖ అధికారులు సాగునీటిని అందిస్తారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాదైనా రైతులు కల నెరవేరేనా లేదా అనేది వేచి చూద్దాం.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-బలిజిపేట

1986 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థుల అపూర్వ కలయిక స్థానిక కళింగ వైశ్య భవన్‌లో సోమవారం ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో స్థిరపడి నేడు బలిజిపేట విచ్చేసిన వారంతా కుటుంబ సభ్యులతో కలిసి పండగ చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులు గంగాధరం, చిన్నంనాయుడు, వెంకటరమణ మాస్టార్లను ఘనంగా సత్కరించాఆరు. గతంలో తమతో కలిసి చదువుకొని కన్నుమూసిన తోటి స్నేహితులను, ఉపాధ్యాయులను తలుచుకొని నివాళులర్పించారు. గత ఏడాది బలిజిపేట జెడ్‌పి ఉన్నత పాఠశాలలో చదువుకొని పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కె.రామ్మూర్తి మాస్టారి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కెవి సూర్యనారాయణ (సూర్యం) నగదు ప్రోత్సాహకంతో పాటు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. సింగిశెట్టి వెంకటరమణ, వి.జగన్నాథ శ్రీనివాసరావు నిర్వహణలో టి.సుధాకర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పిరిడి కామినాయుడు(గణేష్), వేగోటి రాములు, వి.శ్రీనివాస్, తాతా నర్సింహమూర్తి, కిల్లాడ లక్ష్మణరావు, తోట మల్లి, కె.సాయి తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : ఒకచోట కలిసిన 1986 బ్యాచ్‌కు చెందిన టెన్త్ విద్యార్థులు

పాచిపెంట : కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పాచిపెంట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద పూర్వ విద్యార్థుల ఆత్మీయక కలయిక సోమవారం అట్టాసంగా జరిగింది 2002-03 సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి విద్యార్థులు అపూర్వ కలయిక పండగ వాతావరణంతో ఒకరిని ఒకరు కుశలమా నేస్తమా అంటూ ఆప్యాయతగా పలకరించుకుంటూ కరచాలనం చేస్తూ చిన్ననాటి చిలిపి చేష్టలను మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని సరదా సందడలతో గడిపారు ప్రస్తుత ఉద్యోగాలు వ్యాపారాలు వివిధ రంగాల్లో స్థిరపడి వారి యొక్క అభివృద్ధి ఒకరినొకరకు తెలియజేసుకున్నారు మనలో ఎవరైనా కష్టాల్లో ఉన్న కష్టాలు ఎదురైనా మనమంతా ఐక్యమత్యంతో ఆదుకునేందుకు సిద్ధంగా ఉందామని ఒకరినొకరు భరోసా కల్పించుకున్నారు ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను స్వాగతించి ఘనంగా సన్మానించారు

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక ఇందిరానగర్ కాలనీలో నివసిస్తున్న ఆర్‌టిసి డ్రైవర్ కోడిబోయిన వెంకటి కుటుంబ సభ్యులు జిఎంఆర్ సేవ స్ఫూర్తితో సంక్రాంతి సందర్భంగా పేదలకు బట్టలు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది పేదలకు దుస్తులు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

బలిజిపేట : పెదపెంకి సంక్రాంతి పండగ సందర్భంగా సత్య సాయి మందిరం వద్ద నేతాజీ గ్రంథాలయం స్థాపకులు ఈర్ల సంజీవ్‌నాయుడు ఆధ్వర్యంలో చీకటి గోపాలనాయుడు చీకటి అప్పలనాయుడు అన్నదమ్ములు 113 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే ఆంజనేయస్వామి కోవిల వద్ద నేతాజీ గ్రంథాలయ స్థాపకులు ఈర్ల సంజీవ్ నాయుడు ఆధ్వర్యంలో బొమ్మి లక్ష్మణ కుటుంబ సభ్యులు 20 మంది నిరు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

వీరఘట్టం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా జనసేన నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులు వావిలపల్లి నాగభూషణ్, మత్స పుండరీకం, జనసేన జానీ, ఎ.శాంబ, ఎన్.ప్రదీప్ కుమార్, ఎఎన్ఎం ఉష, రోగులు ఉన్నారు.

బలిజిపేట : పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న లక్ష్మణరావు

మృతి చెందిన పురుషోత్తం

పండగవేళ విషాదం

భామిని : మండలంలోని సోలికిరిలో పండగ పూట విషాదం నెలకొంది. ఈ గ్రామ పరిధిలోని వంశధార నదికి స్నానానికి నలుగురు యువకులు వెళ్లారు. వీరిలో ఎర్ర పురుషోత్తం (26) నదిలో నీటి లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఒడ్డు నుంచి జారిపడి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. ఎర్ర పురుషోత్తం (26) స్నేహితుడైన రౌతు జగదీశ్ స్వగ్రామమైన బాలేరుకు సంక్రాతికి వచ్చాడు. సోమవారం ఉదయం పురుషోత్తంతో పాటు జగదీష్, రౌతు ఢిల్లీ, కోయబత్తురు నుంచి సంక్రాంతికి వచ్చిన గిరి సోలికిరి సమీపంలో వంశధార నదికి స్నానానికి వెళ్లారు. నది ఒడ్డున స్నానం చేసే క్రమంలో పురుషోత్తం లోతుగా ప్రాంతంలో పడిపోవటంతో చనిపోయాడు. పురుషోత్తం స్వగ్రామం కవిటి మండలం కొత్త పుట్టుగ. పండగ వేళ స్నేహితుడ్ని కోల్పోడంతో మిగిలిన వారు బోరు విలపిస్తున్నారు.

నేరాలు ఘోరాలు

డివైడర్ ఢీకొట్టి యువకుడు మృతి

పార్వతీపురం టౌన్ :. స్నేహితునితో కలసి మోటార్ సైకిల్ పై వెళ్తుండగా ఆదివారంజరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పార్వతీపురం పట్టణ ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి గరుగుబిల్లి కి చెందిన వావిలపల్లి గౌరి శంకర్రావు గరుగుబిల్లిలో వాలంటీర్ గా పనిచేస్తున్నాడు. తన స్నేహితుడు చిట్టి రఘువర్మ (24) హైదరాబాద్ లోని ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు గ్రామానికి వచ్చాడు. స్నేహితులిద్దరూ కలిసి మోటార్ సైకిల్ పై పార్వతీపురం వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రోడ్డు పక్క ఫుట్ పాత్‌ను ఢీకొని పడిపోవడంతో అక్కడ ఉన్న పూలకుండీ రఘు తలకు తగిలి తీవ్ర గాయాల య్యాయి. గౌరీ శంకర్రావుకు తీవ్ర గాయాల య్యా యి. గమనించిన స్థానికులు వెంటనే 108 ద్వారా జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొద్దిసేపటికే రఘు మృతి చెందాడు. గౌరీశంకర్రావు పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ రిఫర్ చేశారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

పార్వతిపురం టౌన్ : రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందగా ఒకరికి గాయాలైన సంఘటన జరిగింది. పట్టణ ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వైకేఎం కాలనీ కి చెందిన పప్పు అప్పారావు తన చెల్లెలు లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతున్నందున స్థానిక కర్షక మహర్షి ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఆదివారం ఉదయం తన తల్లి పప్పు పార్వతమ్మను (60) తీసుకొని మోటార్ సైకిల్ పై ఆసుపత్రికి వెలుతుండగా వైకేఎం కాలనీ ఎస్పీ కార్యాలయం రోడ్డు కూడలి వద్ద మోటార్ సైకిల్ స్కిడ్ అయి పడిపోవడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను జిల్లాకేంద్రాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ ఫక్రుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పార్వతీపురంరూరల్ : పార్వతీపురం, కొమరాడ మండలం శివిని మధ్య రైల్వేట్రాక్‌పై రైలు ఢీకొని గుర్తు తెలియని, వ్యక్తి మృతి చెందాడు. మృతుడికి సుమారు 33ఏళ్ల వయస్సు ఉండొచ్చునని జిఆర్‌పి పోలీసులు అంచనా వేస్తున్నారు. మృతుడు నీలిరంగు ప్యాంటు ధరించాడు. జీఆర్పి హెచ్‌సి రత్నకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.